సాక్షి నిజామాబాద్

శనివారం । 7 । డిసెంబర్ । 2024



క్రీడా మైదానం పరిశీలన

ఆర్మూర్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు.

- 8లో ▸



అంబేడ్కర్‌కు ఘన నివాళి

జిల్లాలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం

38.0 /20.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మహేశ్‌గౌడ్‌ను కలిసిన విపుల్‌గౌడ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా గెలుపొందిన విపుల్‌గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ విపుల్‌గౌడ్‌ను సన్మానించారు.

నేడు వ్యాసరచన పోటీలు

ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఉదయం అవినీతి నిరోధక శాఖ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ముఖ్య అతిథిగా వస్తున్నారన్నారు.

9 వరకు ఓటరు నమోదుకు అవకాశం

నిజామాబాద్ అర్బన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం ఈ నెల 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా ఏఈఆర్‌వో కార్యాలయాల్లో నేరుగా కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి నమోదు చేసుకోవాల్సి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు



మోపాల్: అటవీ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ సౌత్ రేంజ్ అధికారి రాధిక తెలిపారు. మండలంలోని మల్కాపూర్‌తండా గ్రామంలోగల అటవీ భూమిలో అక్రమంగా బోరు వేస్తున్న వారిపై కేసు నమోదుచేసి బోరుబండ్లను స్వాధీనం చేసుకున్నామని శుక్రవారం తెలిపారు. అటవీ సంపదను కొల్లగొడితే, మొరం, ఇసుక అడవికి నిప్పు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాధిక హెచ్చరించారు. బీట్ అధికారి సంయుక్త, సెక్షన్ అధికారి సాబిక్ ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు డీసీపీ



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిజామాబాద్ అదనపు డీసీపీ(అడ్మిన్)గా జి బస్వారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కోటేశ్వర రావు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

స్మార్ట్ సిటీగా ఇందూరు

- ఇదే లక్ష్యంతో పనిచేస్తున్నా.. • నగర సుందరీకరణకు కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తా
- అమృత్, భూగర్భ డ్రెయినేజీ కోసం నిధులు మంజూరు చేయించా
- నగరంలో చారిత్రక కట్టడాల ప్రాధాన్యతను దేశవ్యాప్తంగా తెలిసేలా చేస్తా
- జీజీహెచ్‌ను కేంద్ర నిధులతో అప్‌గ్రేడ్ చేయిస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఇందూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్లు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన కట్టడాల గురించి దేశవ్యాప్తంగా తెలిసేలా చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా ఏడాది కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే ధన్‌పాల్ పలు అంశాలపై మాట్లాడారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

సాక్షి ఇంటర్వ్యూ

➡ నగరంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో చాలావరకు ధ్వంసమయ్యాయి. వీటి మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1.25 కోట్లు నిధులు తీసుకొచ్చా. మరమ్మతులు పూర్తయ్యాక డబుల్ ఇళ్ల లబ్ధిదారులకు అప్పగిస్తాం. రైల్వే కాలనీ నుంచి కంఠేశ్వర్ జంక్షన్ మీదుగా సాయిప్రియనగర్ వరకు రూ.4 కోట్ల నిధులతో 2.7 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తయింది.

➡ అమృత్ పథకం రెండో దశ కింద భూగర్భ డ్రైన్ కోసం రూ.162.81 కోట్లు మంజూరు చేయించా. ఇదే స్కీం కింద తాగునీటి సరఫరా కోసం రూ.217 కోట్లు నిధులు తీసుకొచ్చా. వీటి పనులు నడుస్తున్నాయి. ఇక సోని ఫంక్షన్ హాల్ వంతెన వద్ద నుంచి ఎల్లమ్మగుట్ట వరకు రోడ్డుకు రూ.4.83 కోట్లు మంజూరు చేయించా. బస్వాగార్డెన్ వద్ద నాలుగు వరుసల రోడ్డుకు రూ.7.66 కోట్లు మంజూరు చేయించాను.

➡ నగరంలో పురాతన కట్టడాలను పరిరక్షించి పూర్వవైభవం తీసుకొచ్చి వాటి చారిత్రక ప్రాధాన్యత దేశానికి తెలియజేస్తా. ఛత్రపతి శివాజీ మహరాజ్ గురువు సమర్థ రామదాసు కట్టించిన ఆలయాలకు మరింత వైభవం తీసుకొస్తా. ఖిల్లా రామాలయాన్ని ఆర్కియాలజీ విభాగం ద్వారా పరిరక్షించడంతో పాటు పర్యాటక శాఖ ద్వారా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయిస్తా. నగరంలో ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళతా. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తిచేయించి వ్యాపారాలను అందులో ప్రారంభిస్తాం.

➡ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలను ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో చేసినట్లుగా ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నా. అదేవిధంగా గిరిరాజ్ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ వచ్చేలా కృషి చేస్తున్నా. ఇక జీజీహెచ్‌కు కేంద్ర నిధులు తీసుకొచ్చి మరింతగా అప్‌గ్రేడ్ చేయిస్తా.

➡ నగర సుందరీకరణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించడంతో పాటు మాస్టర్ ప్లాన్‌ను పక్కాగా రూపొందించి అమలు చేసే లక్ష్యంతో ముందుకు వెళతా. గతంలో సగం వరకు చేసి ఆపేసిన పనులను తిరిగి ప్రారంభించేలా చేస్తా. సగంలో నిర్మాణం ఆగిన ఎల్లమ్మగుట్ట వంతెనను పూర్తి చేయిస్తా. ఈ మేరకు నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నా. గతంలో రూ.100 కోట్ల ప్రత్యేక నిధులను ఆపేశారు. తిరిగి ఆయా పనులను ప్రారంభించేలా చేస్తా. నగరపాలక సంస్థను అవినీతి రహితంగా చేయడమే లక్ష్యంగా పని చేస్తా. పారదర్శకత కోసం కృషి చేస్తాం. నగరంలో రామర్తి చెరువు, బొందెం చెరువు ఆక్రమణలను తొలగించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం.

➡ కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఇందూరు నగరాన్ని స్మార్ట్ సిటీ పథకంలో పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నా. ఇందులో భాగంగా ఇటీవల ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసినప్పుడు నియోజకవర్గం, నగర అభివృద్ధికి సంబంధించి అవసరమైన నిధుల గురించి విన్నవించా. నగర అభివృద్ధి నిధుల కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నా. నగర సుందరీకరణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళుతున్నా.

➡ మహబూబ్‌నగర్, కొడంగల్‌లకే కాకుండా ప్రభుత్వం అన్ని ప్రాంతాలను సమానంగా నిధులు కేటాయించాలి. పక్షపాతం చూపిస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో సంబరాలు ఎందుకు చేసుకుంటున్నారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలి. షబ్బీర్‌అలీ వచ్చాయని చెప్పిన రూ.10 కోట్లు ఏమయ్యాయో తెలియదు. ప్రజలు ఆరు గ్యారెంటీల కోసం ఎదురు చూస్తున్నారు. ఏమీ చేయకుండానే అన్నీ చేసినట్లు చెప్పడం బాగాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ధోరణి మార్చుకోవాలి.

శాస్త్రీయ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రూరల్, అర్బన్ ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ

- ఎమ్మెల్యేలు ధన్‌పాల్, భూపతిరెడ్డి
- నగరంలో సైన్స్ ఫెయిర్

నిజామాబాద్ అర్బన్: విద్యార్థులు శాస్త్రీయ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్, సైన్స్ ఫెయిర్‌ను వారు ప్రారంభించారు. విద్యార్థులను వారి టాలెంట్‌కు అనుగుణంగా ప్రోత్సహిస్తే బంగారు భవిష్యత్ లభిస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విస్తృతంగా ఏర్పాటు చేస్తే విద్యార్థుల్లో ఉత్సాహం పెరుగుతుందన్నారు. సుస్థిర అభివృద్ధి కోసం వనరులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఇన్‌స్పైర్‌లో 126, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో 410 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదనపు కలెక్టర్ అంకిత్, డీఈవో అశోక్, జిల్లా సైన్స్ అధికారి గంగకిషన్, డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వాసుదేవరావు, సాయిరెడ్డి కాంతారావు, అమ్రాద్ పాఠశాల హెచ్ఎం సురేష్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగెళ్ల సురేష్, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థిని

జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరు

నిజామాబాద్ అర్బన్: జిల్లాకు జవహర్ నవోదయ విద్యాలయం మంజూరు చేస్తూ కేంద్ర క్యాబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఇది వరకు కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌లో జవహర్ నవోదయ విద్యాలయం కొనసాగుతోంది. కాగా కొత్త జిల్లాల ఏర్పాటుతో నిజామాబాద్ జిల్లాలో నవోదయ అందుబాటులో లేదు. దీంతో ఎంపీ ధర్మపురి అర్వింద్ పలు సార్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను కలిసి విన్నవించారు. దీంతో జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరు చేశారు. దీంతో ఎంపీ అర్వింద్ ప్రధాని మోదీకి, మంత్రులు అమిత్ షా, దేవేంద్ర ప్రదాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదనలు అందలేదు

- లోక్‌సభలో ఎంపీ అర్వింద్ ప్రశ్నకు మంత్రి సమాధానం
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును కలిసిన ఎంపీ

సుభాష్‌నగర్: జిల్లాలోని జక్రాన్‌పల్లి వద్ద నిర్మించాలన్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి స్థలం అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపాదనలు అందలేదని కేంద్ర పౌర విమానాయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) విమానాశ్రయాల నిర్మాణానికి ఆరు చోట్ల ప్రీ ఎలిజిబిలిటీ అధ్యయనం నిర్వహించిందని, అందులో భాగంగా వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో బ్రౌన్‌ఫీల్డ్, నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి వద్ద గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి సాంకేతికంగా వీలున్నట్టు గుర్తించిందని ఆయన తెలిపారు. ఈ మూడు చోట్ల ఎయిర్‌పోర్టులు నిర్మించాలంటే అబ్‌స్టాకిల్ లిమిటేషన్ సర్ఫేసెస్ (ఓఎల్ఎస్) సర్వే నిర్వహించి, కేంద్ర పౌర విమానయాన శాఖ, ఇతర రెగ్యులేటరీ, చట్టబద్ధ సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి ఏఏఐ సూచించిందని మంత్రి పేర్కొన్నారు. కాగా ఇదే అంశంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును ఢిల్లీలోని తన కార్యాలయంలో ఎంపీ అర్వింద్ ధర్మపురి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనుమతుల జాప్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు జక్రాన్‌పల్లి విమానాశ్రయ నిర్మాణం, అందుకు స్థల అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని, ఏళ్లుగా ఓఎల్ఎస్ సర్వే పెండింగ్‌లో ఉందని తెలిపారు. అనంతరం ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ ఓఎల్ఎస్ సర్వే చేస్తే ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభం అవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపిన తర్వాతే జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టులో విమానాలు దిగే ఆస్కారం ఉంటుందన్నారు. ఏళ్లుగా సర్వే పెండింగ్‌లో ఉంటే గత సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. విమానాశ్రయ ఏర్పాటు అంశంలో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి చొరవ తీసుకుని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి త్వరగా ప్రతిపాదనలు పంపించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు.



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమైన ఎంపీ అర్వింద్

ఓటరు జాబితా సవరణలో పనితీరు భేష్

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కితాబు
- ఈఆర్‌వో కార్యాలయాలు, ఈవీఎం గోడౌన్‌ల పరిశీలన

నిజామాబాద్ అర్బన్/బోధన్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం పనితీరు బాగుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సి సుదర్శన్ రెడ్డి ప్రశంసించారు. ఇతర అన్ని జిల్లాలతో పోలిస్తే ముసాయిదా ఓటరు జాబితా రూపకల్పన, మార్పులు, చేర్పులకు సంబంధించి దాఖలైన దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపుతున్నారని సంతృప్తి వెలిబుచ్చారు. సీఈవో సుదర్శన్ రెడ్డి శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి నగరంలోని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఈఆర్‌వో ఆఫీసును, బోధన్‌లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బోధన్ నియోజకవర్గ ఈఆర్‌వో ఆఫీసులను సందర్శించారు. నోటీసు బోర్డులపై అతికించిన ముసాయిదా ఓటరు జాబితాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సూచనలు చేశారు. ఓటరు జాబితా నుంచి మృతి చెందిన వారి పేర్లు తొలగించే సందర్భంలో మరణ ధ్రువీకరణ పత్రం జత చేయాలన్నారు. అనంతరం వినాయకనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను సీఈవో సందర్శించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రత ఏర్పాట్లను పరిశీలన జరిపారు. సీసీ కెమెరాలు సక్రమంగానే పని చేస్తున్నాయా లేదా అని గమనించారు.



ఈవీఎంను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

కలెక్టరేట్‌లో సమీక్ష

కలెక్టరేట్‌లో జిల్లాలోని నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో సీఈవో సమీక్ష జరిపారు. ఎస్ఎస్ఆర్ ప్రక్రియలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సీఈవోకు వివరించారు. సీఈవో మాట్లాడుతూ.. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయని, ఇకముందు కూడా ఇదే తరహా శ్రద్ధ చూపాలని అన్నారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా పక్కాగా ఓటరు జాబితా రూపొందేలా కృషి చేయాలని ఆదేశించారు. ఒక కుటుంబానికి చెందిన సభ్యులందరు ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఓటు హక్కు కలిగి ఉండేలా చూసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, కిరణ్మయి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ ఉన్నారు.

సీఎం కప్ పోటీలు ఎలా?

- నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారిన క్రీడా ప్రాంగణాలు

మోర్తాడ్(బాల్కొండ): సీఎం కప్ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం శని, ఆదివారాల్లో క్రీడా పోటీలు నిర్వహించనుంది. అయితే క్రీడా ప్రాంగణాలు అస్తవ్యస్తంగా ఉండటంతో పోటీల నిర్వహణ ఎలా అనే సందేహం వ్యక్తం అవుతోంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. నిర్వహణ లేక అవి అధ్వానంగా మారాయి. అనేక గ్రామాల్లో అర ఎకరం కంటే తక్కువ విస్తీర్ణంలోనే ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో కేవలం బోర్డులను మాత్రమే తగిలించారు. ప్రస్తుతం సీఎం కప్ పోటీల్లో భాగంగా అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలతో పాటు యోగా పోటీలను నిర్వహించనున్నారు. యోగా పోటీలకు పాఠశాలల్లోని వేదికలు, వరండాలను ఉపయోగించుకోవచ్చు. మిగిలిన క్రీడలకు మాత్రం కష్టమే అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.



అధ్వానంగా ఉన్న ఏర్గట్ల క్రీడా ప్రాంగణం

మండల కేంద్రాల్లో మినీ స్టేడియాలు కరువు

మండల కేంద్రాల్లో మినీ స్టేడియాలు ఉండాలని గతంలో నిర్ణయించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో స్టేడియాలు ఉన్నాయి. బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్, కమ్మర్‌పల్లిలో మినీ స్టేడియాలు ఉన్నాయి. మిగిలిన మండల కేంద్రాల్లో మాత్రం అనువైన స్థలాలు లేవు. మండల స్థాయిలో ఈనెల 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు పోటీలను నిర్వహించాల్సి ఉంది. స్థలభావంతో అనేక చోట్ల మండల కేంద్రాలను వదలి గ్రామాల్లోనే మండల స్థాయి పోటీలను నిర్వహించాలని తీర్మానించారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల గుర్తింపు కోసం పారదర్శకంగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. యాప్ ద్వారా సర్వే నిర్వహించాల్సిన విధానంపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లకు కలెక్టరేట్‌లో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఏయే అంశాలను పరిశీలించాలి, మొబైల్ యాప్‌లో నమోదు చేయాలో వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ యాప్ ద్వారా సర్వే జరపాల్సిన విధానంపై శనివారం అన్ని మండలాలలో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా సర్వే జరపాలన్నారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీవో సాయాగౌడ్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ పాల్గొన్నారు.

మీటర్లలో కచ్చితత్వం ఉండేలా చర్యలు

- వరంగల్ చీఫ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) అశోక్

సుభాష్‌నగర్: ఎల్‌టీ మీటర్లు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్, సీటీ మీటర్, హెచ్‌టీ మీటర్లను టెస్ట్ బెంచ్‌పై పరీక్షించి అత్యంత ప్రామాణికంగా, కచ్చితత్వంగా ఉండేలా చర్యలు చేపట్టామని వరంగల్ చీఫ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) అశోక్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఎంఆర్‌టీ ల్యాబ్‌లో ఏర్పాటుచేసిన సెమీ ఆటోమేటిక్ మీటర్ టెస్ట్ బెంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ రూ.37లక్షలు వెచ్చించి టెస్ట్ బెంచ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇక నుంచి జిల్లాలో అన్ని మీటర్ల టెస్టింగ్ కచ్చితత్వంగా ఉండే విధంగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలో విద్యుత్ సరఫరా, వినియోగదారుల సమస్యలు, తదితర అంశాలపై సీఈ అశోక్ సమీక్ష నిర్వహించారు. 33 కేవీ ఫీడర్స్ లైన్లు, 11 కేవీ ఓవర్ లోడ్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్స్ కూడా జనవరిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పోల్స్ నెంబర్ పూర్తి చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈనెల 9, 10 తేదీల్లో పూర్తి తనిఖీ చేసి నివేదికను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రాపల్లి రవీందర్, టెక్నికల్ డీఈ రమేష్, డీఈలు వెంకటరమణ, శ్రీనివాస్‌రావు, పీవీ రాజేశ్వర్‌రావు, ఉత్తమ్‌జాడే, ఎండీ ముక్తార్, ఏడీఈలు నీలిమ, వరప్రసాద్, నటరాజ్, తోట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సెమీ ఆటోమేటిక్ మీటర్ టెస్ట్ బెంచ్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ చీఫ్ ఇంజినీర్ అశోక్

క్లుప్తంగా

క్రీడామైదానం పరిశీలన



ఆర్మూర్‌: పట్టణంలోని జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో నిర్వహించే ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించే 68వ రాష్ట్రస్థాయి స్కూల్‌ గేమ్స్‌ అండర్‌–17 సాఫ్ట్‌బాల్‌ పోటీలకు నిర్వహించే క్రీడామైదానాన్ని జిల్లా స్కూల్‌ గేమ్స్‌ కార్యదర్శి నాగమణి శుక్రవారం పరిశీలించారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో 360 మంది క్రీడాకారులు, 100మంది కోచ్‌, మేనేజర్లు రానున్నట్లు పేర్కొన్నారు. బాలుర పాఠశాలలో భోజనవసతి, అకామిడేషన్‌, విద్యాహైస్కూల్‌, ప్రజ్ఞా హైస్కూల్‌, వింగ్స్‌, అప్పర్‌, ప్రైమరి స్కూల్‌, ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఫిజికల్‌ డైరెక్టర్‌ బొజ్జ మల్లేశ్‌గౌడ్‌, జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి గంగామోహన్‌, రాజ్‌కుమార్‌, సంజీవ్‌, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోంగార్డ్‌లకు ప్రశంసాపత్రాలు అందజేత



ఖలీల్‌వాడి: హోంగార్డ్స్‌ రైజింగ్‌ డే సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన హోంగార్డులకు డీసీపీ(అడ్మిన్‌) కోటేశ్వర్‌రావు శుక్రవారం ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్‌ స్వామి(ఆర్మూర్‌), పి పోతన్న(బోధన్‌ రూరల్‌), బి జీవన్‌ సింగ్‌ (నిజామాబాద్‌ ట్రాఫిక్‌), ఎస్‌ రఘువీర్‌(త్రీ టౌన్‌), షేక్‌ ఖాజా(ఏసీపీ, నిజామాబాద్‌)కు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డీసీపీ(ఏఆర్‌) శంకర్‌ నాయక్‌, ఆర్మ్‌డ్‌ రిజర్వ్‌(అడ్మిన్‌) సతీశ్‌, ఎంటీవో తిరుపతి, సీసీఆర్‌బీ సీఐ వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మోపాల్‌ ఎస్సైపై ఇన్‌చార్జి సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: మోపాల్‌ ఎస్సై యాదగిరిగౌడ్‌పై సిర్పూర్‌ గ్రామానికి చెందిన బొడ్డు గంగారెడ్డి, కుటుంబ సభ్యులు శుక్రవారం ఇన్‌చార్జి సీపీ సింధుశర్మకు ఫిర్యాదు చేశారు. సిర్పూర్‌ తండాలో ఇటీవల కొనుగోలు చేసిన తన భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన కౌలు దారు సాగుచేసిన పంటను ధ్వంసం చేశాడు. దీనిపై మోపాల్‌ పీఎస్‌లో ఎస్సైకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదన్నారు. ఈ నెల 4న గంగారెడ్డి మరో ఇద్దరితో కలిసి మోకాపైకి వెళ్లగా అక్కడే ఉన్న 40 మంది తమపై దాడి చేశారన్నారు. భూమి కబ్జాపై కోర్టులో కేసు వేయగా కోర్టు ఇంజక్షన్‌ ఆర్డర్‌ ఇచ్చిందన్నారు. ఈ విషయమై ఎస్సై దృష్టికి తీసుకొచ్చిన కబ్జాదారులకు అనుకూలంగా మాట్లాడి సెటిల్‌మెంట్‌ చేసుకోవాలని బెదిరించారన్నారు. అంతేకాకుండా తనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్నారు. ఈ విషయంలో ఎస్సైపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకువాలని కోరారు. స్పందించిన ఇన్‌చార్జి సీపీ వెంటనే ఏసీపీ రాజా వెంకట్‌ రెడ్డిని విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆదేశించినట్లు తెలిసింది.

తప్పిపోయిన బాలిక అప్పగింత

ఖలీల్‌వాడి: మెట్‌పల్లిలో తప్పిపోయిన ఓ బాలిక జిల్లా కేంద్రంలో ఉన్నట్లు సమాచారం అందడంతో స్థానిక పోలీసులు శుక్రవారం ఆమెను పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మెట్‌పల్లికి చెందిన ఓ బాలిక తప్పిపోయి జిల్లా కేంద్రానికి చేరుకుంది. దీంతో అక్కడి పోలీసులు జిల్లా కేంద్రంలో ఉన్నట్లు గుర్తించి ట్రాఫిక్‌ పోలీసులకు సమాచారం అందించారు. ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌, ఎస్సై సంజీవ్‌ బస్టాండ్‌, రైల్వే స్టేషన్‌ ప్రాంతాల్లో వెతుకగా బస్టాండ్‌ వద్ద బాలికను గుర్తించారు. వెంటనే మెట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించి వారు రాగానే బాలికను అప్పగించారు.

జనం కోసమే తపన

- నియోజకవర్గమంతా నా కుటుంబమే
- అభివృద్ధి, సంక్షేమాలకు ప్రాధాన్యత
- పనులు నిరాటంకంగా జరిగేలా చూడాలని సీఎంను కోరా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ''బాన్సువాడ నియోజకవర్గం నా కుటుంబం.. ప్రజలకు మేలు చేయాలన్నదే నా ఆశయం.. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం జనం మధ్యే ఉండడం నాకు అలవాటు. 1994లో ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచిన నాటి నుంచి ఇప్పటి దాకా ప్రతి రోజూ ప్రజల కోసమే పనిచేస్తున్నా. భవిష్యత్తులోనూ ప్రజలతోనే ఉంటా''నని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాదైన సందర్భంగా శుక్రవారం 'సాక్షి' ఆయనను ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు..

ప్రభుత్వ వైద్యం మెరుగుపడేలా...

వర్నిలో రూ. 11 కోట్లతో చేపట్టిన 30 పడకల ఆస్పత్రి దాదాపు పూర్తి కావచ్చింది. కోటగిరిలో రూ.13 కోట్లతో 50 పడకల ఆస్పత్రి పనులు జరుగుతున్నాయి. బాన్సువాడలో రూ.37.50 కోట్లతో వంద పడకల ఆస్పత్రి పునర్నిర్మాణ పనులు నడుస్తున్నాయి. పల్లె దవాఖానాల పనులు పురోగతిలో ఉన్నాయి. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే తపనతో ఇవన్నీ చేయించా. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎన్ని నిధులైనా తీసుకువస్తా.

రోడ్లకు నిధులు..

పంచాయతీరాజ్‌ శాఖ ద్వారా ఎంఆర్‌ఆర్‌ నిధులు రూ.20 కోట్లతో మంజూరైన పనులకు టెండర్లు పూర్తయ్యాయి. సీఆర్‌ఆర్‌ నిధులు రూ.15 కోట్లు మంజూరయ్యాయి. 23 పనులకు సంబంధించి టెండర్లు జరిగి పనులు ప్రారంభం కానున్నాయి. ఈజీఎస్‌ కింద రూ.20 కోట్లతో సీసీ రోడ్లు, జీపీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మిస్తున్నాం. ఎస్‌డీఎఫ్‌ కింద రూ.10 కోట్లతో వివిధ మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులు మొదలయ్యాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లు మిగిలిపోయిన వైడెనింగ్‌ పనులకు రూ.140 కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చాను. ఆ నిధులు మంజూరైతే రోడ్ల సమస్య తీరిపోతుంది. మెదక్‌ నుంచి ఎల్లారెడ్డి, ఎల్లారెడ్డి నుంచి రుద్రూర్‌ జాతీయ రహదారికి రూ.9 వందల కోట్లతో పనులు మొదలయ్యాయి.

డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల బిల్లులు..

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి రూ.15 కోట్లు.. కొత్త ప్రభుత్వంలో తీసుకుని లబ్ధిదారులకు చెక్కులు అందించాం. మరో రూ.15 కోట్లు రావాల్సి ఉంది. అవి కూడా త్వరలోనే వస్తాయని ఆశిస్తున్నా. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కొత్త యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరవుతాయి. ఇప్పటివరకు రాష్ట్రంలోనే అత్యధికంగా 11 వేల డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లను బాన్సువాడ నియోజకవర్గంలో నిర్మించాను.

విద్యాభివృద్ధి కోసం..

స్థానికంగా బీఎస్సీ అగ్రికల్చర్‌ కోర్సులు అందుబాటులో ఉంటే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. అందుకే బాన్సువాడకు అగ్రికల్చర్‌ బీఎస్సీ కాలేజీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నా. కోనాపూర్‌లో రూ.12 కోట్లతో చేపట్టిన ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల నిర్మాణ పనులు బేస్‌మెంట్‌ లెవల్‌కు వచ్చాయి. నస్రుల్లాబాద్‌లో రూ.12 కోట్లతో ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల భవనం నిర్మించేందుకు టెండర్లు పూర్తయ్యాయి.

నిరంతరం శ్రమిస్తున్నా

బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నా. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రగతి సాధించానంటే దాని వెనక నా కఠోర శ్రమ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. నేను పెళ్లికి వెళ్లినా.. ఇతర ఫంక్షన్లకు వెళ్లినా ప్రజలతో మాట్లాడుతా. వారు ఏదైనా సమస్య చెబితే అక్కడికి వెళ్లి చూస్తా. రెగ్యులర్‌గా హాస్టళ్లు, గురుకులాలు, ఆస్పత్రులకు వెళ్లి పరిశీలిస్తా. దీంతో పెద్ద సార్‌ ఎప్పుడొస్తడో అన్న భయం అక్కడి అధికారులు, ఉద్యోగుల్లో కనిపిస్తుంది. ఎలక్షన్లకు, ఓట్లకు సంబంధం లేకుండా నిరంతరం అభివృద్ధి, సంక్షేమం కోసమే కష్టపడుతున్నా. అందుకే నియోజకవర్గ ప్రజలు ప్రతిసారి ఆశీర్వదిస్తున్నారు.

పురోగతిలో అభివృద్ధి పనులు..

రూ.258 కోట్లతో మొదలుపెట్టిన సిద్దాపూర్‌ రిజర్వాయర్‌ పనులు కొనసాగుతున్నాయి. రూ.150 కోట్లతో చేపట్టిన జాకోరా, చందూర్‌, చింతకుంట లిఫ్ట్‌ ఇరిగేషన్‌ పనులూ పురోగతిలో ఉన్నాయి. బీర్కూర్‌ వద్ద రూ.40 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాం పనులు సాగుతున్నాయి. నిజాంసాగర్‌ కెనాల్‌ లైనింగ్‌ పనులు పూర్తికావచ్చాయి. కొడిచర్లలో రూ.18 కోట్లతో చేపట్టిన లిఫ్ట్‌ ఇరిగేషన్‌ పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమవుతోంది. రూ.70 కోట్లతో పాతంగల్‌లో చేపట్టిన లిఫ్ట్‌ పనులు పూర్తి కావస్తున్నాయి.

చేపపిల్లల కేంద్రంపై పట్టింపేదీ?

- సీజన్‌ ప్రారంభం నుంచి సెలవులో ఉన్న మత్స్యశాఖ అధికారి
- నేటికీ విధుల్లో చేరని వైనం
- ఇబ్బందుల్లో మత్స్యకారులు



మత్స్య అభివృద్ధి అధికారి కార్యాలయం

బాల్కొండ: ఎస్సారెస్పీ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల కేంద్రంపై ఉన్నతాధికారుల పట్టింపు కరువవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. చేపపిల్లల కేంద్రంలోని మత్స్య అభివృద్ధి అధికారి సీజన్‌ ప్రారంభం నుంచి సెలవుపై ఉండడంతో ఈ కేంద్రాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఈ ఏడాది చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియ చేపట్టలేక పోయారు. గత సాధారణ బదిలీలకు ముందు ఉన్న లాయక్‌ మొహినొద్దీన్‌ మత్స్య అభివృద్ధి అధికారిగా విధులు నిర్వర్తించారు. బదిలీల్లో భాగంగా బాన్సువాడ నుంచి డొలిసింగ్‌ పోచంపాడ్‌ మత్స్య అభివృద్ధి అధికారిగా వచ్చారు. కానీ ప్రభుత్వం ఈ శాఖలో ఖాళీలు అధికంగా ఉండటంతో ఎక్కడ ఎలా భర్తీ చేయాలో తెలియక బదిలీలను రద్దు చేస్తూ ఎక్కడి వారిని అక్కడే నియమించారు. దీంతో లాయక్‌ మొహినొద్దీన్‌ యథాస్థానానికి వచ్చాడు. నాటి నుంచి సెలవుపై వెళ్లిన అతను నేటికి తిరిగి రాలేదు. దీంతో పోస్టు ఖాళీగానే ఉంది.

అసలే చేప పిల్లల ఉత్పత్తికి ఆది నుంచి ఆటంకాలు ఉన్నాయి. దీనికి తోడు అధికారి కూడా లేకపోవడంతో చేప పిల్లల కేంద్రాన్ని ఫీల్డ్‌మన్‌లో చూసుకునే పరిస్థితి నెలకొంది. కొంత కాలంగా పోచంపాడ్‌ చేప పిల్లల కేంద్రానికి పూర్తి స్థాయి అధికారిని నియమించడం లేదు. 2018 వరకు గతంలో జిల్లా ఏడీగా ఉన్న రాజానర్సయ్య మత్స్య అభివద్ధి అధికారిగా ఉన్నారు. దీర్ఘకాలికంగా ఆయనే ఇక్కడ విధులు నిర్వర్తించారు. మధ్యలో ఆర్మూర్‌ నుంచి పూర్ణిమ మత్స్య అభివృద్ధి అధికారిగా విధులు నిర్వర్తించారు. రాజానర్సయ్య ఇన్‌చార్జి ఏడీగా బాధ్యతలు చేసిన సమయంలో కూడా పోచంపాడ్‌ బాధ్యతలు చేపట్టారు. కానీ తర్వాత పూర్తి స్థాయిలో ఏడీగా పదోన్నతి పొందిన తర్వాత నుంచి పోచంపాడ్‌కు ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. పాలకులు స్పందించి పూర్తి స్థాయి అధికారిని నియమించి సమస్యను పరిష్కరించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

విధుల్లో చేరాలని సూచించాం

పోచంపాడ్‌ మత్స్య అభివృద్ధి అధికారి లాయక్‌ మొహినొద్దీన్‌ను విధుల్లో చేరాలని రెండు రోజుల క్రితం సూచించాం. కానీ ఇప్పటి వరకు రిపోర్టు చేయలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

– అంజనేయులు, ఏడీ, నిజామాబాద్‌

కాంగ్రెస్‌ది భస్మాసుర హస్తం



బైక్‌ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్‌

- బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది
- అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్‌

నిజామాబాద్‌ సిటీ: అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పార్టీది అభయహస్తం కాదు.. భస్మాసుర హస్తం అని అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. అంతకుముందు బీజేపీ ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌ చౌరస్తా నుంచి ఎన్టీఆర్‌ చౌరస్తా వరకు బైక్‌ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాయ మాటలు చెప్పి పదేళ్లు బీఆర్‌ఎస్‌ పరిపాలిస్తే.. అబద్ధపు హామీలతో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్‌ మాయమాటలు నమ్మిన ప్రజలకు వంద రోజుల్లో హామీల అమలు అని చెప్పి ఏడాది గడుస్తున్నా ఒక్క గ్యారంటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఏడాదిపాలన పేరుతో విజయోత్సవాలంటు రూ. కోట్లాది ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం విజయోత్సవాలను ఎందుకోసం నిర్వహిస్తుందో చెప్పాలని డిమాండ్‌ చేశారు. కౌలు రైతులకు రూ.15 వేలు, ఎకరానికి రూ. 15వేలు, ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు చేయలేదని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ పథకంలో తులం బంగారం ఎందుకు ఇవ్వలేదని అన్నారు. చదువుకునే ఆడపిల్లలకు ఎలక్ట్రిక్‌, జర్నలిస్టుల సంక్షేమానికి రూ.100 కోట్ల నిధి, ఇండ్ల స్థలాల కేటాయింపు ఇవ్వనందుకు పండుగలు చేసుకోవాలా అని ప్రశ్నించారు. తాను ప్రశ్నించిన అంశాలపై చర్చకు వచ్చే దమ్ము ముఖ్యమంత్రికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఉంటే రావాలన్నారు. వచ్చే మున్సిపల్‌, కార్పొరేషన్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీని ప్రజలు బొంద పెట్టడం ఖాయమన్నారు. ఇకనైనా పాలనపై దృష్టి సారించాలని లేకుంటే కేసీఆర్‌కి పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్షణికావేశాలకు లోను కాకూడదు



అవగాహన కల్పిస్తున్న రమణ

పిట్లం(జుక్కల్‌): విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్‌ అయ్యామని, తక్కువ మార్కులు వస్తున్నాయని, సమాజంలో అవహేళనకు గురవుతున్నామని క్షణికావేశాలకు లోనై ఆత్మహత్యలు చేసుకోవద్దని, భవిష్యత్తులో చాలారకాల అవకాశాలు ఉంటాయని మానసిక వైద్య నిపుణులు డాక్టర్‌ జి.రమణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ జి.రమణ పాల్గొని మాట్లాడారు. అంతేకాకుండా ఈ వయసులో మత్తు పదార్థాల జోలికి అస్సలు వెళ్లకూడదని, మొబైల్‌ ఫోన్‌ వినియోగం తగ్గించాలన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు చెప్పిన మాటలను వినాలని సూచించారు. అలాగే ఎవరికైనా మానసిక ఆందోళనకు గురైతే నేరుగా టోల్‌ ఫ్రీ నెంబర్‌ 14416కి కాల్‌ చేయాలన్నారు. వైద్యులు రోహిత్‌, సోషల్‌ వర్కర్‌ డాక్టర్‌ రాహుల్‌ కుమార్‌, అధ్యాపకులు నరేష్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడి రాజీనామా

నిజామాబాద్‌ సిటీ: జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్ష పదవికి బాదావత్‌ కిషన్‌ నాయక్‌ రాజీనామా చేశారు. అనారోగ్య కారాణాలతో తన పదవీకి రాజీమా చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్‌కు తన రాజీనామా పత్రాన్ని అందించారు. నూతన అధ్యక్షుడిని త్వరలో ఎన్నుకోనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

బోర్గాం(పి)లో అగ్ని ప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి)లో నడ్పి గంగారాం, కృష్ణలకు చెందిన పెంకుటిల్లు షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్‌ ఆఫీసర్‌ నర్సింగ్‌రావు శుక్రవారం తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

వివాహిత అదృశ్యం

నిజామాబాద్‌ రూరల్‌: గంగస్థాన్‌ ఫేస్‌–1కు చెందిన గాట్ల విజయ అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో మహమ్మద్‌ ఆరిఫ్‌ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. విజయకు కొన్ని రోజులుగా మానసిక ఆరోగ్యం బాగాలేదని, చికిత్స తీసుకుంటున్నట్లు వివరించారు. శుక్రవారం సాయంత్రం బయటికి వెళ్లిన విజయ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి



విఠల్‌ మృతదేహం

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి పట్టణంలో బైక్‌పై నుంచి పడిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మహేశ్‌ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌ జిల్లా హవేళిఘన్‌పూర్‌ మండలంలోని పోచమ్మరాల్‌ తండాకు చెందిన రమావత్‌ దేవీసింగ్‌ తన బైక్‌పై మెగావత్‌ విఠల్‌(46)ను ఎక్కించుకుని అతివేగంగా బైక్‌ నడుపుతుండగా ఆటోను ఢీకొనడంతో బైక్‌పై వెనక కూర్చున్న విఠల్‌ కింద పడడంతో తలకు తీవ్రగాయాలై ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మరొకరు..



లక్ష్మి మృతదేహం

ఎల్లారెడ్డి: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని సాతెల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మి(35) ఇంటికి సర్వీస్‌ వైర్‌కు సంబంధించిన తీగలు తలుపునకు ఆనుకొని ఉండడంతో విద్యుదాఘాతం సంభవించి లక్ష్మి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


యువకుడిపై పోక్సో కేసు

బోధన్‌రూరల్‌: ప్రేమ పేరుతో బాలికను నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన వినయ్‌ అనే యువకుడు ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తప్పిపోయిన పిల్లలు దొరికారు

ఖలీల్‌వాడి: నగరంలోని హష్మీ కాలనీకి చెందిన ముగ్గురు పిల్లలు ఉదయం కిరాణషాపునకు వెళ్లి తప్పిపోయారని తిరిగి సాయంత్రం దొరికినట్లు ఐదో టౌన్‌ ఎస్సై గంగాధర్‌ తెలిపారు. శుక్రవారం ఉదయం నగరంలోని హాష్మీకాలనీకి చెందిన మహమ్మద్‌ బిలాల్‌, అయేషా ఫాతిమా, మహమ్మద్‌ అలీ అనే ఆరేళ్ల లోపు పిల్లలు కిరాణ దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికుల ద్వారా పిల్లల ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై ఎస్సై పేర్కొన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పీఎస్‌లో 14 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్సై మొగిలయ్య శుక్రవా రం పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదేశాల మేరకు సెల్‌ఫోన్‌లకు అందించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్‌ పోతే సీఈఐఆర్‌ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే బాధితులకు సెల్‌ఫోన్‌ గుర్తించి అందిస్తామని ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

రుద్రూర్‌: భార్యను చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ ఐదో అదనపు జిల్లా సెషన్స్‌ కోర్టు బోధన్‌ మెజిస్ట్రేట్‌ కె రవికుమార్‌ తీర్పు వెల్లడించారని కోటగిరి ఎస్సై సందీప్‌ పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. పోతంగల్‌ మండలం కొల్లూర్‌లో 2022సెప్టెంబర్‌14న నిమ్మల అంజని హత్యకు గురైంది. అంజనిని భర్త నిమ్మల పోశెట్టి హత్య చేసినట్లు కుమార్తె ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై రాము కేసు నమోదు చేయగా, సీఐ జాన్‌రెడ్డి చార్జిషీట్‌ వేశారు. బాధితుల తరఫున అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ శ్యామ్‌రావ్‌ వాదనలు వినిపించారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి నిందితుడు పోశెట్టికి జీవిత ఖైదు, రూ. వెయ్యి జరిమానను న్యాయమూర్తి విధించారు. జరిమానా చెల్లించకుంటే ఏడాది కఠిన కారాగార శిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించారని ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన డ్రంకన్‌ డ్రైవ్‌లో ముగ్గురికి సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బస్టాండ్‌, మీసేవా, నిఖిల్‌సాయి చౌరస్తాలో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ సిబ్బందితో కలిసి డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీలు చేపట్టారు. ఇందులో నిర్మల్‌ జిల్లా నర్సాపూర్‌కు చెందిన రాథోడ్‌ మోతీలాల్‌ పట్టుబడగా పోలీసులు జడ్జి ఎదుట హాజరుపర్చగా అతనికి వారం రోజుల జైలు శిక్ష విధించారు. మరో ఇద్దరు మహారాష్ట్రలోని బోకర్‌కు చెందిన జి అనిల్‌, నగరంలోని వినాయకనగర్‌కు చెందిన పిల్లి సాగర్‌కు మూడు రోజుల జైలు శిక్ష వేశారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

న్యూసెన్స్‌ కేసులో ఒకరికి..

ఖలీల్‌వాడి: న్యూసెన్స్‌ కేసులో ఒకరికి ఒకరోజు జైలు శిక్షను జడ్జి విధించినట్లు నాలుగో టౌన్‌ ఎస్సై శ్రీకాంత్‌ శుక్రవారం తెలిపారు. ఆర్యనగర్‌కు చెందిన వడ్ల శివకుమార్‌ కొన్ని రోజులుగా మద్యం సేవించి కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల వారిని ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అతన్ని కోర్టులో హాజరుపర్చగా జడ్జి సాక్ష్యాలను పరిశీలించి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడికి రెండు రోజులు..

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన అంతిగిరి అఖిలేష్‌ అనే యువకుడికి రెండోక్లాస్‌ మెజిస్ట్రేట్‌ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం పేర్కొన్నారు. జీజీహెచ్‌ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి యువకుడిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి అతనికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

రౌడీ షీటర్‌కు మూడేళ్ల జైలు

బోధన్‌టౌన్‌: పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, వారిపై దాడిచేసిన రౌడీషీటర్‌ అబ్బు అలియాస్‌ అబ్దుల్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధిస్తూ బోధన్‌ అసిస్టెంట్‌ సెషన్‌ కోర్టు న్యాయమూర్తి శ్రీ దేవన్‌ అజయ్‌కుమార్‌ శనివారం తీర్పును వెల్లడించారు. పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హైటెక్‌ బార్‌ ఎదుట రవీందర్‌ అనే వ్యక్తి మిర్చి బండి పెట్టుకొని జీవిస్తున్నాడు. 16.4.2023 రోజున రౌడీషీటర్‌ అబ్బు అలియాస్‌ అబ్దుల్‌ రవీందర్‌ను డబ్బులు ఇవ్వమని అడిగితే అతను డయల్‌–100కు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాలాజీ, సంజీవ్‌పై అబ్బు బూతులు తిడుతూ దాడి చేసి గాయపర్చాడు. కానిస్టేబుల్‌ బాలాజీ చేసిన ఫిర్యాదు మేరకు నాటి సీఐ ప్రేమ్‌కుమార్‌ కేసునమోదు చేశారు. శనివారం అడిషనల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ సమ్మయ్య సాక్ష్యాలను జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు. వాటిని పరిశీలించిన జడ్జి రౌడీ షీటర్‌ అబ్బుకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. వంద జరిమానా విధించారు. జరిమాన కట్టకుంటే ఒక నెల సాధారణ జైలు శిక్షను విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ శుక్రవారం పేర్కొన్నారు. ఎల్లారెడ్డికి చెందిన ఏగుల నర్సింలు, మర్రి ప్రకాశ్‌కు చెందిన పొలంలో సబావత్‌ సురేందర్‌ కంచెలను తొలగించడంతో అడ్డుకున్నందుకు వారిని బెదిరించినట్లు ఎస్సై తెలిపారు. బెదిరింపులకు పాల్పడిన సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

శిఖం భూమిలో వేసిన బోరు సీజ్‌



నాగిరెడ్డిపేట: మండలంలోని ఆత్మకూర్‌ శివారులో ఉన్న శిఖంభూమిలో వేసిన బోరును రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్‌ చేశారు. దీంతో పాటు బోరుకు ఏర్పాటు చేసిన కరెంట్‌ కనెక్షన్‌ను సైతం ట్రాన్స్‌కో సిబ్బంది సాయంతో తొలగించారు. ఆత్మకూర్‌ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌ గతంలో గ్రామ శివారులోని శిఖం భూమిలో బోరు వేశారు. ఈ విషయమై అదే గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు సర్వే చేపట్టి బోరు శిఖం భూమిలో ఉన్నట్లు తేల్చారు. దీంతో నాగిరెడ్డిపేట ఆర్‌ఐ మహ్మద్‌, ట్రాన్స్‌కో లైన్‌మన్‌ కరుణాకర్‌ శిఖం భూమిలో ఉన్న బోరు వద్దకు చేరుకొని దానిని సీజ్‌ చేశారు. దీంతో పాటు సదరు బోరుకు ఉన్న కరెంట్‌ కనెక్షన్‌ను తొలగించారు.

ఆలయంలో చోరీ

నిజామాబాద్‌ రూరల్‌: ముబారక్‌నగర్‌ శివారులో ఉ న్న మహాలక్ష్మి ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరిఫ్‌ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆలయంలో రోజువారిలాగే అర్చకులు గురువారం రాత్రి పూజలు చేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయాన్ని శుభ్రపరిచే మహిళ వచ్చి చూడగా హుండీ తాళం పగులగొట్టి ఉండటాన్ని చూసి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు ఆలయానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.